క్లుప్తంగా

ఇసుక దోపిడీని అరికట్టాలి



వాజేడు: గోదావరి పరివాహకం వెంట ఉన్న ఇసుక క్వారీల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఇసుకక్వారీల్లో అర్ధరాత్రి అక్రమ తవ్వకాలను సాగిస్తున్నట్లు ఆరోపించారు. అక్రమ తవ్వకాలు సాగిస్తూ డంపింగ్ చేస్తున్న ఇసుక క్వారీలపై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రాహుల్‌చంద్ర వర్మకు అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పూనెం రామ చందర్, సతీష్, సోమరాజు, రాజబాబు, చంటి ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు

వాజేడు: ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని చీకుపల్లి గ్రామం వద్ద శనివారం చోటు చేసుకుంది. తాడ్వాయి మండల పరిధిలోని దామెరవాయి గ్రామానికి చెందిన మహేష్ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. చీకుపల్లి గ్రామం వద్దకు రా గానే మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి బొగత జలపాతం వైపునకు వెళ్లే రహదారి వైపున పైనుంచి కిందకు పడిపోయింది. స్థానికులు వెంటనే మహేష్‌ను 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు ఆస్పత్రికి తరలించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడి



ఏటూరునాగారం: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఎక్సైజ్‌శాఖ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు చేపట్టారు. మంగపేట మండలంలోని నాటుసారా తయారీ, అమ్మకాలపై ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. పది లీటర్ల నాటుసారా, 900 లీటర్ల చక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే లెంకల లక్ష్మణ్‌రావు, చల్లా శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా నాటుసారా తయారీ చేసినా, అమ్మినా రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో కానిస్టేబుల్ నవీన్, శ్రీనివాస్‌గౌడ్, వీరన్న, నాగరాజు, ప్రణయ్ పాల్గొన్నారు.

నలుగురి రిమాండ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం మీదుగా మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలు, రెండు బొలేరా వాహనాలను హైదరాబాద్ సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 22న పట్టుకుని కాళేశ్వరం పోలీసులకు అప్పగించారు. మహారాష్ట్రలోని సిరొంచ వ్యాపారి వద్దకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీలను మార్గమధ్యలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని, భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన పార్వతీ శ్రీధర్, బత్తుల రఘురాం, బీహార్‌కు చెందిన రంజీత్, సిరొంచకు చెందిన వీరస్ కుమార్‌లపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ తెలిపారు.

బంధువుపై కత్తితో దాడి

మహదేవపూర్: మండలంలోని బేగ్లూర్ గ్రామంలో భూ తగాదాలతో బంధువుపై కత్తితో ఓ వ్యక్తి దాడి చేయగా అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బేగ్లూర్ గ్రామానికి చెందిన కారు పోషయ్యను భూతగాదాల కారణంగా కారు మల్లయ్య కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాధితుడి భార్య కారు దుర్గమ్మ ఫిర్యాదు మేరకు మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మోటారు కనెక్షన్లను తొలగించకుంటే చర్యలు

భూపాలపల్లి: మిషన్ భగీరథ నల్లా లైన్‌కు బిగించిన మోటార్ల కనెక్షన్ తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ టి.రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మోటార్లు బిగించిన వారిని గుర్తించి నల్లా కనెక్షన్‌ను తొలగించడమే కాక మున్సిపల్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అన్నారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

‘పీఎం జీవనజ్యోతి’ని వినియోగించుకోవాలి

- ఎస్‌బీఐ మేనేజర్ భిక్షపతి

ఏటూరునాగారం : ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ భిక్షపతి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును మేనేజర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన కావిరి సుగుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బ్యాంకు ఖాతా ద్వారా కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్ నుంచి రూ.436 చెల్లించి బీమా చేసింది. ఆమె మృతి చెందగా



నామినీకి చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ భిక్షపతి

నామినీగా ఉన్న ఆమె కుమారుడు సంతోష్‌కు రూ.2 లక్షల చెక్కును అందించారు. ప్రతి ఖాతాదారుడు రూ.436 చెల్లించి బీమా చేయించుకోవాలని, మరో రూ.20 ప్రీమియం చెల్లిస్తే మరో రూ.2 లక్షల ప్రమాద బీమా సొమ్ము వస్తుందని తెలిపారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ అదే భీమా రూ.1000 చెల్లిస్తే రూ.20 లక్షలు బీమా సొమ్ము వస్తుందని తెలిపారు. పాముకాటు, పిడుగుపాటు, కరెంట్ షాక్, రోడ్డు ప్రమాదంలో మరణిస్తే పైపథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ బీమా ద్వారా తమ కుటుంబానికి ఆసరాగా నిలవాలని కోరారు. సుగుణ కుమారుడు సంతోష్ మాట్లాడుతూ తమ తల్లి మరణంతో వచ్చిన బీమా డబ్బుల ద్వారా తన చెల్లెలి పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ బి.సరిరాం, సీఎస్పీ పూతల లక్ష్మీవిజయ్ పాల్గొన్నారు.

మణికంఠ మందిరం ప్రథమ వార్షికోత్సవం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని శ్రీ దుర్గా శివగణేశ సుబ్రహ్మణ్య వేంకటేశ్వరాంజనేయ సహిత సోపాన శ్రీగిరి మణికంఠ మందిరం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు పరాశక్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీఎంకే గాంధీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవంలో భాగంగా గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం అగ్నిస్థాపన, అయ్యప్పస్వామికి మిగతా దేవతలకు అభిషేకాలు, విశేష హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవాల కార్యక్రమానికి వేద పండితులు వరంగల్ భద్రకాళీ ఆలయం గురువులు శేషు స్వామి మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామస్తులు, యువకులు, మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

గడ్డివాము దగ్ధం



కాటారం: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని బొప్పారంలో శనివారం చోటు చేసుకొంది. బుర్రి మల్లయ్య ఇంటి సమీపంలో పశుగ్రాసం నిల్వ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు, బాధిత రైతులతో కలిసి మంటలు ఆర్పడానికి ప్రయత్నించినప్పటికి మంటలు అదుపులోకి రాలేదు. ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పినప్పటికీ పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు మల్లయ్య తెలిపారు.

జంపన్నవాగును కలుషితం చేయొద్దు

- బిల్ కలెక్టర్‌కు స్థానికుల వినతి
- నివారణ చేయకుంటే ఆందోళన చేస్తాం

ఏటూరునాగారం: గ్రామంలో నిత్యం జీవనదిగా పారే జంపన్నవాగును కలుషితం చేయొద్దని స్థానికులు తాళ్లపెల్లి నరేందర్, గడ్డం మహేష్, సప్పిడి రాం నర్సయ్య, బూర రాజయ్య, కొండాయి చిన్ని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ సర్వ వెంకన్నకు జంపన్నవాగు ఒడ్డు, బూర రాజయ్య ఇంటి వెనుకాల వ్యర్థాలను వేస్తున్నారని వాటిని తొలగించాలని వినతిపత్రం అందజేశారు. వాగు ఒడ్డు వెంట గ్రామంలోని కోళ్ల షాపుల వ్యాపారులు, చేపలను విక్రయించే వారు వ్యర్థాలను ఇక్కడ పడేయడంతో సమీపంలోని ఇళ్లకు దుర్వాసన వస్తుంది. చేపల వ్యర్థాలతో పందులు, కుక్కలు, ఇతర జంతువులు తిని వ్యాధి బారిన పడుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి అక్కడ వ్యర్థాలను వేసేవారిపై చర్యలు తీసుకోవాలని,జంపన్నవాగును శుద్ధిగా ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నోటీసులు జారీ చేశాం

గ్రామంలోని భవాని చికెన్ సెంటర్, సతీష్, షబ్బీర్,



బిల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

ఖైరొద్దీన్, అజీమ్, రాజ్ మహ్మద్ చాంద్, ఇస్మాయిల్, మంచర్ల చికెన్ షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశామని గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు. గ్రామంలో జంపన్నవాగు ఒడ్డు వెంట వ్యర్థాలను వేయరాదని, ఊరికి దూరంగా రెండు కిలోమీటర్లలో గొయ్యితీసి పాతిపెట్టాలని ఆదేశాలు ఇచ్చాం. నిబంధనల ప్రకారం చేయకపోతే కేసులు పెడుతాం. వారితో కోఆర్డినేషన్ సమావేశం కూడా ఏర్పాటు చేసి ఇబ్బందులు, సమస్యలు వివరించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

చదువు, ఉద్యోగాలపై యువత దృష్టి సారించాలి



గ్రామస్తులతో ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు: చదువు, ఉద్యోగాలపై యువత దృష్టి సారించాలని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దూలాపురం గ్రామంలో శనివారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్, సివిల్ రైట్స్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ పేకాట, కోడిపందాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, గుడుంబా లాంటి మత్తు పదార్థాలను సేవించడం, అమ్మడం చేయవద్దన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విప్లవ సంఘాలకు, విప్లవ పార్టీలకు దూరంగా ఉండాలని సూచించారు. వన్యప్రాణుల కోసం, ఉచ్చులు, విద్యుత్ పెట్టి ప్రమాదాలకు కారణం కావద్దని అలా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు నేరమని ప్రేమ పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు చెప్పారు.

వేంకటేశ్వర ఆలయంలో వసంతోత్సవం



స్వామివారి ఊరేగింపు కార్యక్రమం చేపడుతున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న స్వామివారి కల్యాణమహోత్సవ వేడుకలను నిర్వహించి ఐదు రోజుల పాటు జాతర కార్యక్రమాలను ఎండోమెంట్ అధికారులు నిర్వహించారు. శనివారం జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో వసంతోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. కాగా స్వామి వారి హుండీ ఆదాయం లెక్కించగా రూ.1, 84,445 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కాటారం: మండలానికి చెందిన పలువురు శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన దుర్గం తిరుపతి, అంతర్గాం రాజమౌళి, గంట బాపు, జాడి లక్ష్మణ్, గోమాస తిమోతి, రాజేందర్ పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న శ్రీనివాస్, సునీల్‌రెడ్డి

కేజీబీవీలో వైద్యశిబిరం

పలిమెల: మండలంలోని పంకెన గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సికెల్‌సెల్, ఎనీమియా వ్యాధులపై వారికి అవగాహన కల్పించారు. అలాగే ఆయుస్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డులను జారీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పూనెం రామారావు, హెచ్‌ఈఓ మురళీధర్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా డేటా మేనేజర్ (డీడీఎం) మధుబాబు, పంకెన ఏఎన్‌ఎంలు బ్యూల, శ్రీలత, ఆశ కార్యకర్త నిర్మల, కేజీబీవీ ఏఎన్‌ఎం అనూష, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ

మంగపేట: మండలంలోని తిమ్మంపేటకు చెందిన బీఆర్‌ఎస్ నేత, పురగిరి పెరిక సంఘం నాయకుడు దంతెనపెల్లి నరేందర్ తండ్రి బుచ్చయ్య, చెరుపల్లిలో మాజీ ఎంపీటీసీ చిలకమర్రి అరుణ తల్లి ముత్తినేని సరోజన ఇటీవల మృతి చెందింది. ఇరువురి బాధిత ఇళ్లలో శనివారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జగదీష్ హాజరయ్యారు. మృతుల చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు వత్సవాయి శ్రీధర్ వర్మ, పల్లా బుచ్చయ్య, మంగపేట ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు చిలకమర్రి రాజేందర్, ఏటూరునాగారం సర్పంచ్ ఈసం రామ్మూర్తి, మండల సీనియర్ నాయకులు రాజుయాదవ్, సమ్మయ్య, సతీష్, అర్జున్, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ శ్రీహరి, తిరుపతి తదితరులు ఉన్నారు. అలాగే అరుణ కుటుంబాన్ని మంత్రి సీతక్క తనయుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ, మహబూబాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జ్ దనసరి సూర్య శనివారం పరామర్శించి ఓదార్చారు. శనివారం జరిగిన సరోజన దశదిన కర్మ కార్యక్రమానికి సూర్య స్థానిక పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.



మంగపేట : తిమ్మంపేటలో బుచ్చయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి



ములుగు రూరల్ : అమృతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాజేందర్

కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల, జిల్లా నాయకులు ఆదినారాయణ, భగవాన్‌రెడ్డి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన ప్రాథమిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వేములపల్లి సమ్మిరెడ్డి తల్లి అమృతమ్మ మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ పరామర్శించారు. శనివారం అమృతమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, కుమార్ గౌడ్, శంకరయ్య, తిరుపతి, అశోక్‌గౌడ్ ఉన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన భూపతి వీరయ్య శుక్రవారం మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్ శనివారం పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అనిల్, రాజు ఉన్నారు.



మంగపేట: మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్య, పార్టీ నాయకులు

జీపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా సదానందం

చిట్యాల: గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అంకం సదానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శనివారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల సంపత్, ఉపాధ్యక్షుడిగా పోతుగంటి అమరేందర్, కోశాధికారిగా ఎలగొండ భద్రయ్య, గౌరవ అధ్యక్షుడిగా మ్యాదరి రాజేందర్, ముఖ్య సలహాదారుడిగా బుర్ర సతీష్‌గౌడ్, సభ్యులుగా బానోత్ రాకేష్, మంద రత్నాకర్, జన్నె సమ్మయ్య, పంబాల రాజయ్య, కె.భద్రయ్య నియమితులయ్యారు.

గుడుంబా పట్టివేత

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని భూపాలపల్లి, చిట్యాల మండలాల్లో దాడులు జరిపామని భూపాలపల్లి ఎక్సైజ్ సీఐ రమ్య తెలిపారు. శనివారం ఎస్‌టీఎఫ్, హెచ్‌వైడీ, డీటీఎఫ్ బృందాలు సంయుక్తంగా భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి, పెద్దకుంటపల్లి, గొర్లవీడు గ్రామాల్లో జరిపిన దాడుల్లో ఇద్దరి నుంచి 35 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని, సుమారుగా 3వేల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రామయ్య సేవలు అభినందనీయం



భూపాలపల్లి : రామయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి: రామయ్య సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం చిట్యాల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంపీడీఓ రామయ్యను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ, సీపీఓ శామ్యూల్ పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వేల్పుకొండ రామయ్య చేసిన సేవలను పలువురు అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్.విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని జూకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రామయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామయ్య 36 ఏళ్ల పాటు ఉద్యోగరీత్యా పలు మండలాల్లోని ప్రజలకు సుదీర్ఘ సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో రేగొండ, ఘణపురం, భూపాలపల్లి, పలిమెల, కాటారం, టేకుమట్ల, మొగుళ్లపల్లి, పరకాల, గీసుకొండ, మహాముత్తారం ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, భాస్కర్, ఇక్బాల్ హుస్సేన్, శ్రీనివాస్, బాబు, అనిత, జయశ్రీ, పెద్ది ఆంజనేయులు, కృష్ణవేణి, శ్రీనివాస్‌లు, ఎంపీఓలు ఏపీఓ, ఏపీఎం మంజుల, వెలుగు ప్రిన్సిపాల్ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



టేకుమట్ల: పది పరీక్ష కేంద్రంలో ఎస్సై, సీఎస్, తదితరులు

మల్హర్: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో చివరి రోజు నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు తాడిచర్ల, పెద్దతూండ్ల, మల్లారం, వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలు, మల్లారం కస్తూర్బాగాంధీ, ఎడ్లపల్లి మోడల్ స్కూళ్లకు చెందిన 166 విద్యార్థులకు 165 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

ఎస్సై ఆధ్వర్యంలో భద్రతా చర్యలు


టేకుమట్ల: ఈ నెల 18 నుంచి 30 వరకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కొనసాగిన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. పరీక్షలకు 148 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై గోగికారి ప్రసాద్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్

మహాముత్తారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 159 మంది విద్యార్థిని విద్యార్థులు చివరి పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

భూపాలపల్లి అర్బన్: క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. బాంబులగడ్డ నుంచి జమహర్‌నగర్ కవనెంట్ చర్చి వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు పాస్టర్ మనోహర్, గౌరవ అధ్యక్షుడు కనక రత్నంలు హాజరై మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు సర్వ మానవాళి పాప పరిహారార్థం రక్తం చిందించి మరణం గెలిచి తిరిగి లేచిన దేవుని కుమారుడని ఆయన ప్రేమ, క్షమాగుణం అందరికీ ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు, సభ్యులు రమేష్, సదానందం, థామస్, శాంతి రాజ్, సదానందం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కాళేశ్వరంలో హనుమాన్ భక్తుల సందడి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ అర్ధ మండల దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 23న హనుమాన్ చిన్నజయంతిని పురస్కరించుకొని సుమారుగా 500 మంది భక్తులకు గురుస్వామి మాడుగుల బాపు శర్మ ఆధ్వర్యంలో మాలధారణ చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కాషాయమయంగా మారడంతో సందడి నెలకొంది.



ఆలయంలో మాలధారణ చేసిన భక్తులు